## క్లుప్తంగా

### ముమ్మరంగా వరి నాట్లు



పీబీసీ పరిధిలో నాట్లు పూర్తయిన పొలాలు

పిఠాపురం: వాతావరణం ఎన్ని ఇబ్బందులు పెట్టినా నేనున్నానంటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్షకులకు అందజేసిన భరోసాతో రైతులు ఆనందోత్సాహాల మధ్య పంటల సాగులో బిజీబిజీగా మారారు. ప్రభుత్వం వరిపంట కోత దశకు చేరుకున్న వెంటనే నాన్పుడి దోరణి లేకుండా ఏలేరు, పీబీసీ పరిధిలో రబీసాగుపై అధికారులు నిర్ణయం ప్రకటించడంతో ఖరీఫ్ కోతలు ముగియగానే రైతులు వెంటనే రబీ సాగుకు సన్నద్ధమై నాట్లు ముమ్మరం చేశారు. పీబీసీ పరిధిలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే 65 శాతానికి పైగా రబీ నాట్లు పూర్తి కాగా మిగిలిన చోట్ల వరి నాట్లు వేగవంతం చేశారు. ఈ ఏడాది ఈ నెలాఖరు లోపు వరి నాట్లు పూర్తి చేయాలని అధికారులు సూచించడంతో రైతులు ఆ దిశగా పనులు మ్మురం చేశారు. నియోజకవర్గ పరిధిలోని పిఠాపురం, కొత్తపల్లి, మండలాల పరిధిలో రబీ నాట్లు ఊపందుకున్నాయి.

### 30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: ప్రతి నెలా జరిగే కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా ఈ నెల 30న శనివారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిసనర్ జె.రామారావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. పట్టణ అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలో 12 అంశాలను పొందుపర్చినట్టు తెలిపారు. ఈ సమావేశానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

### ఘనంగా చండీ హోమం



మరిడమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహన రావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవోపేతంగా హోమాన్ని జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### వికసిత్ భారత్ యాత్ర

పెద్దాపురం: రానున్న 2047 ఏడాది నాటికి దేశాన్ని ఆర్థిక శక్తిగా మార్చేందుకే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ ప్రచార యాత్ర చేపట్టిందని పెద్దాపురం మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. మండలంలోని గుడివాడ, సిరివాడ గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ యాత్ర నిర్వహించారు. బీజేపీ నాయకులు విత్తనాల వెంకటరమణ, దుర్గా మోహన్‌రెడ్డి, దువ్వా శ్రీదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయుష్మాన్ భవ కార్డులను పంపిణీ చేశారు.

### సారా విక్రేత అరెస్టు

కొత్తపల్లి: సారా విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన ప్రకారం మండలంలోని పొన్నాడ శివారు కొనపాపపేటకు చెందిన వాసంశెట్టి మధు సారా విక్రయిస్తున్నాడని సమాచారం రావడంతో ఎస్సై స్వామి నాయుడు తన సిబ్బందితో దాడి చేసి అతడిని అరెస్టు చేసి తన వద్ద నుంచి 13 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### కోడిపందాల స్థావరంపై దాడి

పిఠాపురం: పోలీసులకు అందిన సమాచారంతో మండల కేంద్రమైన కొత్తపల్లి శివారులో దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.3,400 నగదు, కోడిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేశారు.

### మహిళలకు ఉచిత శిక్షణ

కాకినాడ సిటీ: ఈ నెల 29వ తేదీ శుక్రవారం కాకినాడ గాంధీనగర్‌లో ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో మహిళలకు ప్రధమ చికిత్స, ఆరోగ్య పరిరక్షణ సూత్రాలు, ఇంట్లో జరిగే అగ్ని ప్రమాదాల నివారణపై ఒక రోజు ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు వ్యక్తిగతంగా కార్యాలయంలో కానీ లేదా 0884 2371409 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

కరప: మండలం కూరాడ శివారు చినమామిడాడలోని ఎస్‌టీసీ చర్చిలో మంగళవారం జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, పాస్టర్ పి.జయబాబుతో కల్సి ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి, 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా సత్తిబాబు, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.ప్రకాష్, జయమణి పాల్గొన్నారు.



మూలపేటలో ఆడుదాం ఆంధ్రా క్రీడలను క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న దొరబాబు తదితరులు



సామర్లకోటలో జరిగిన ఇండోర్ షటిల్ బ్యాడ్మింటన్



సామర్లకోటలో జరుగుతున్న ఖోఖో



పెద్దాపురంలో క్రికెట్ ఆడుతున్న సీఐ రవికుమార్



వడ్లమూరులో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ, వీర్రాఘవరావు

# క్రీడల సంక్రాంతి

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- క్రీడాపోటీల ప్రారంభం
- సద్వినియోగం చేసుకోవాలని యువతకు పిలుపు



క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ఆటలాడే శక్తి సామర్థ్యాలు ఉండి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాలు లేని క్రీడాకాలకు మంచి అవకాశమే ఆడుదాం ఆంధ్రా అని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన గొల్లప్రోలు బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి వారికి మంచి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నేతలు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, మొగలి బాబ్జీ, అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఆహ్వానితుడు మొగలి అయ్యారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సామర్లకోట: సంక్రాంతి పండగను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుగానే తీసుకొచ్చారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంతో ప్రతి గ్రామంలోను పండగ వాతావరణం వచ్చిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను దొరబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా సచివాలయ స్థాయి నుంచి క్రీడాకారులకు పోటీలు నిర్వహించి, ఉత్తమ క్రీడాకారులను రాష్ట్ర స్థాయి వరకు తీసుకెళ్లి బహుమతులు ఇవ్వడం శుభపరిణామమన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్టుచెప్పారు. క్రీడాకారులు తమ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, సామర్లకోట ప్రతిభను రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ క్రీడల ద్వారా క్రీడాకారుల ప్రతిభను జాతీయ స్థాయికి పరిచయం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, పెద్దాపురం జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, పీడీ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, పిట్టా సత్యనారాయణ, పాలిక కుసుమ, సేపెని సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. కాగ మండలంలోని సచివాలయాల సమీపంలో హైస్కూళ్లలో ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో క్రికెట్‌ను ప్రారంభించిన దొరబాబు



కాంద్రకోటలో క్రీడాకారులకు మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ

**అట్టహాసంగా క్రీడా పోటీలు**

పెద్దాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని స్థానిక మహారాణి కళాశాలలో ఈ పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మండలంలోని కాండ్రకోటలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, చంద్రమాంపల్లిలో గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, వడ్లమూరులో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు ప్రారంభించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంల అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా అందరి ఆట అని, ప్రతిఒక్కరిలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇది దోహదపడుతుందన్నారు. అనంతరం సచివాలయ స్థాయి క్రీడా పోటీలను ఆయా పాఠశాలల క్రీడా మైదానాల్లో ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఎంపీడీఓ బి.అశోక్‌కుమార్, సీఐ రవికుమార్, ఎస్సై సురేష్, ఎంఈఓలు, పీఈటీలు పాల్గొన్నారు.

**క్రీడా స్ఫూర్తిని పెంచుకోవాలి**

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికి తీసేందుకు సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా క్రీడలను నిర్వహిస్తున్నారని, దీని ద్వారా క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవచ్చని వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు అన్నారు. మండలంలో ఉన్న అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడలను ప్రారంభించారు. మూలపేటలో జెడ్పీ క్రీడా మైదానంలో పోటీలను కంబాల మౌనిక ఆధ్వర్యంలో క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. దొరబాబు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ పోటీలను యువతీ యుకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రభుత్వమే అన్ని విధాలా ప్రోత్సహిస్తుందన్నారు. మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, ఎంపీడీఓ వెంకట నారాయణ, మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు కంబాల లక్ష్మణరావు, అడ్డా త్రిమూర్తులు, సిద్ధి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి వలీ, వ్యాయామ ఉపాధ్యాయుడు హరి బాబు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా దత్త జయంతి ఉత్సవాలు



శ్రీపాద శ్రీవల్లభ స్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కాణిపాక దేవస్థానం చైర్మన్ మోహన్‌రెడ్డి తదితరులు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దొరబాబు, కాణిపాక దేవస్థానం అధికారులు



స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పంచారామ క్షేత్రంలోని దత్తాత్రేయస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

పిఠాపురం: వారం రోజులుగా నిర్వహిస్తున్న దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా పాదగయ క్షేత్రంలో వెలసిన దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు వైభవంగా నిర్వహించారు. వేలాది మంది స్వాములు, భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా దత్త హోమాలు నిర్వహించగా ఆలయ ప్రాంగణం దత్త నామాలతో మార్మోగింది. పుష్కరిణిలో స్వామివారి తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించగా పలువురు భక్తులు స్వామివార్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దత్త గురు స్వామి వాడ్రేవు శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈఓ ఆర్.సౌజన్య తదితరులు పాల్గొన్నారు. పాదగయ క్షేత్రంలోని వేంచేసియున్న దత్తాత్రేయ స్వామితో పాటు, స్వామి వారి పాదుకలు ఉన్న శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం, శ్రీపాద శ్రీవల్లభ అనఘా దత్త క్షేత్రం, శ్రీగోపాల్‌బాబా ఆశ్రమం వంటి పుణ్య స్థలాలతో విరాజిల్లుతున్న పట్టణంలో ఈ ఉత్సవాలు వైభవంగా ముగిసాయి.

పిఠాపురం దత్త క్షేత్రాల్లో వైభవంగా నిర్వహించిన దత్త జయంత్యుత్సవాల్లో ఎమ్మెల్యే పెండెం దొరబాబు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిచి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయాల అభివృద్ధికి పలు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కాణిపాకం వరసిద్ధి వినాయక దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, జేఈఓ విద్యాసాగర్, వేద పండితులు ఉత్సవాలకు హాజరై స్వామికి పట్టు వస్త్రాలు, పురుహూతికా అమ్మవారికి చీర సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్లు రెడ్డెం జనార్దన్, ఆగంటి ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నేతలు గండేపల్లి బాబీ, తలిశెట్టి వెంకటేశ్వరరావు, మొగలి బాబ్జీ, కొత్తపల్లి బుజ్జి, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, ఈఓలు ఆర్.సౌజన్య, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో దత్త జయంతి వేడుకలు**

సామర్లకోట: దత్త జయంతిని పురస్కరించుకుని దత్తాత్రేయ స్వామి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంగళవారం ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని పట్టు వస్త్రాలు, పూలతో అలంకరించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దత్త జయంతి సందర్భంగా కుమారారామ భీమేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. స్థానిక మారుతీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో దత్తాత్రేయ స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, హోమాలు చేశారు. మధ్యాహ్నం లక్షపత్రి పూజలు, దత్త హోమం, నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాద వితరణ జరిగింది. స్టేషన్ సెంటర్‌లోని దత్తాత్రేయ స్వామి ఆలయంలోను, బట్ల బజార్‌లోని దత్తాత్రేయస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్టేషన్ సెంటర్‌లోని దత్తాత్రేయ ఆలయం వద్ద చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది.



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో చిన్నారుల కోలాటం



శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానానికి పోటెత్తిన భక్తులు

# శాంతివర్ధనలో క్రిస్మస్ సంబరం



విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులతో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న జెడ్పీటీసీ

పెద్దాపురం: పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు అంబరాన్నంటాయి. శాంతివర్ధన మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు రాయవరపు వీరబాబు, సత్య దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రిస్మస్ వేడుకల్లో ప్రముఖ దైవజనులు విల్సన్ (కాకినాడ) క్రిస్మస్ సందేశాన్ని అందించారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు సేవలందిస్తున్న వీరబాబు, సత్యను వారు అభినందించారు. దైవజనులు నంగిన సత్యానందం, కె.అభిషేక్, జయ కుమార్, జేమ్స్, జ్యోతిబాబు, టి.బ్లెస్సింగ్ మాట్లాడుతూ క్రిస్మస్ అంటే క్రీస్తును ఆరాధించాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో క్రిస్మస్ వేడుక నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులతో కలిసి సూరిబాబు, రాజశేఖర్‌లు క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ప్రముఖ గాయకులు రాజేష్ క్రైస్తవ గీతాలు ఆలపించారు. విభిన్న ప్రతిభావంతులు క్రీస్తు జననంపై చేసిన నృత్యరూపకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఒబిలిశెట్టి అబ్బాయి, కనపర్తి చీమదొర, పార్టీ నాయకులు బోనాసు గుర్రాజు. తుమ్మల అచ్యుతరామయ్య, సుందరరెడ్డి రాజు, లక్కాకుల కృష్ణ, పాస్టరమ్మలు నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, విశాల, పాఠశాల ఏఓ వేణు పాల్గొన్నారు.

# అభిమానుల మధ్య మట్టపల్లి అంతిమ యాత్ర

అధిక సంఖ్యలో తరలివచ్చిన వివిధ పార్టీల నాయకులు



మట్టపల్లి రమేష్‌కు సంతాపం తెలుపుతున్న దొరబాబు

సామర్లకోట: సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు సభ్యుడు మట్టపల్లి రమేష్‌బాబు అంతిమ యాత్ర అభిమానుల మధ్య మంగళవారం సాగింది. స్థానిక అంబటి వారి వీధి నుంచి పంచారామ క్షేత్రం వద్ద ఉన్న కైలాస భూమి వరకు అంతిమ యాత్ర కొనసాగింది. సోమవారం మట్టపల్లి రమేష్‌బాబు కన్నుమూసిన విషయం విదితమే. మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకునిగా, ట్రస్టు బోర్డు చైర్మన్‌గా, లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా ఆయా పదవులకు రమేష్‌బాబు వన్నె తెచ్చారు. ఆయన మరణ వార్త తెలుసుకుని వివిధ ప్రాంతాల్లో ఉన్న బంధువులు, అభిమానులు తరలిరావడంతో మంగళవారం ఉదయం దహన సంస్కారాలు నిర్వహించారు. ఆయన స్వగృహం నుంచి మొదలైన అంతిమ యాత్రలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మాజీ ఎమ్మెల్యే పంతం గాంధీ మోహన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గోలి వెంకటఅప్పారావు చౌదరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, మన్యం చంద్రరావు, టీడీపీ కార్యదర్శి బడుగు శ్రీకాంత్,, జనసేన అధ్యక్షుడు సరోజ్ వాజు, ఆయా పార్టీల నాయకులతో పాటు లారీ యజమానుల సంఘ సభ్యులు, వ్యాపారస్తులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ మట్టపల్లి సేవలు ఎన్నటికీ మరువలేమన్నారు. ఆయన కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కండలు బిగిస్తే.. పతకం పడాల్సిందే..



బాడీ బిల్డింగ్ పతకం సాధించిన సురేష్‌బాబు

- బాడీ బిల్డింగ్‌లో దూసుకుపోతున్న పిఠాపురం క్రీడాకారుడు
- అంతర్జాతీయ పతకాల సాధనే లక్ష్యమంటున్న సురేష్‌బాబు

పిఠాపురం: మధ్య తరగతి కుటుంబానికి చెందిన అతడు చిన్న చిన్న ఆటలాడుతూ.. పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు. చదువుకుంటూనే చిన్ననాటి నుంచి సిక్స్‌ప్యాక్ శరీర సౌష్ఠవాన్ని సాధించాలన్న సంకల్పంతో వ్యాయామం చేస్తూ వచ్చాడు. లక్ష్యసాధన దిశలో మంచి శరీర సౌష్ఠవాన్ని పొందిన అతడు.. అంతటితో ఆగకుండా పతకాల వేటలో కఠిన శిక్షణ పొందాడు. ఈ నేపథ్యంలో పోటీల్లో పాల్గొంటే చాలు.. పతకం అతడి సొంతం అన్న చందంగా తయారైంది. అతనే పిఠాపురానికి చెందిన కేతినీడి సురేష్ బాబు. కాకినాడ పీఆర్ కాలేజీలో బీఎస్సీ పెట్రో కెమికల్స్ డిగ్రీ చేసిన అతను.. ఇమ్మోర్టల్ ఫిట్‌నెస్ జోన్‌లో డిప్లమో ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ చేశాడు. బాడీ బిల్డింగ్‌లో ఆసక్తి ఉన్న అతను పిఠాపురానికి చెందిన కోచ్ లక్ష్మణరావు వద్ద శిక్షణ పొందాడు. ఒకవైపు రెజ్లింగ్‌లో ప్రావీణ్యం సంపాదించి, అందులో పతకాలు సాధిస్తూనే, శరీర సౌష్ఠవాన్ని పెంపొందించుకున్న అతను.. సొంతంగా ఇమ్మోర్టల్ ఫిట్‌నెస్ జోన్‌లో ప్రవేశించి, సొంతంగా జిమ్ కోచ్‌గా పని చేయడం ప్రారంభించాడు.

**సాధించిన పతకాలు**

నన్నయ విశ్వవిద్యాలయం బాడీ బిల్డింగ్ పోటీల్లో 2015లో తొలిసారిగా కాంస్య పతకం సాధించాడు. 2016లో రెజ్లింగ్‌లో గోల్డ్ మెడల్, పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ కాలేజీలో నిర్వహించిన రెజ్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో రజత పతకం కైవసం చేసుకున్నాడు. 29 రాష్ట్రాలకు చెందిన సుమారు 1,200 మంది క్రీడాకారులు తలపడిన 2023లో ఐసీఎన్ గోవా షోలో పాల్గొని ప్రశంసలు అందుకున్నాడు. దానిలో బాడీ బిల్డింగ్ మూడో బ్రోజ్, క్లాసిక్ ఫిజిక్ 4, 5వ స్థానాల్లో కాంస్య పతకాలు, పురుషుల క్లాసిక్ ఫిజిక్1లో స్వర్ణం మొత్తం ఐదు పతకాలు సాధించాడు.

**దేశానికి అంతర్జాతీయ పతకాలే లక్ష్యం**

మాది మధ్య తరగతి కుటుంబం. నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. చూసిన ఆటలన్నీ ఆడుతూ, వాటిలో మంచి క్రీడాకారుడిగా గుర్తింపు పొందాలనే తపనతో ఉండేవాడిని. ప్రత్యేక శిక్షణ పొందడానికి మాకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో నాకు తెలిసిన, నన్ను ప్రోత్సహించిన కోచ్ లక్ష్మణ రావు వద్ద శిక్షణ పొందాను. ఆయన నాకు వెన్నంటి ఉండి, మంచి ప్రోత్సాహం ఇవ్వడంతో తక్కువ కాలంలోనే నాకు ఇష్టమైన బాడీ బిల్డింగ్‌లో పతకాలు సాధించగలిగాను. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి, ఇటు దేశానికి, అటు పుట్టిపెరిగిన పిఠాపురానికి మంచి పేరు తీసుకురావాలనేదే నా ధ్యేయం. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తాను.

– కేతినీడి సురేష్‌బాబు, బాడీ బిల్డింగ్ క్రీడాకారుడు, పిఠాపురం

# క్లెయిమ్‌ల సత్వర పరిష్కారానికి చర్యలు

ఆర్డీఓ జేఎస్ రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టామని, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు సహకరించాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్‌లో మంగళవారం ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రీ సర్వే కార్యక్రమం మరింత వేగవంతంగా చేపట్టినట్టు వివరించారు. ఓటరు జాబితాపై అపోహలు ప్రజల్లో తొలగిపోవాలంటే, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ సమావేశంలో పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, చింతా శ్రీనివాసరావు (వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ)తో పాటు వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐటీఐలో 2 నుంచి బ్రిడ్జి కోర్సు ప్రారంభం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు ఐటీఐ ఉత్తీర్ణులైన వారికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు సంబంధించిన బ్రిడ్జి కోర్సు వచ్చే నెల రెండో తేదీన ప్రారంభం కానుంది. ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 94946 88516 నంబరులో కూడా సంప్రదించవచ్చని సూచించారు.